క్లుప్తంగా

నిధులు కేటాయించాలి



గార్ల: గార్ల సమీపంలోని పాకాల ఏటిపై హైలెవెల్ బ్రిడ్జి నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ జన సమితి పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపగాని శంకర్‌రావు సోమవారం రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, రాజేందర్‌నాయక్, గిన్నారపు మురళీ పాల్గొన్నారు.

మిత్రుడికి ఆర్థికసాయం



డోర్నకల్: పాతడోర్నకల్‌కు చెందిన రెడ్డెయిన శ్రీనివాస్ తీవ్ర అనారోగ్యానికి గురై హైదరాబాద్ ఏఐజీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. పేదవాడైన శ్రీనివాస్ చికిత్స కోసం స్నేహితుడైన మామిడి నాగరాజు రెడ్డెబోయిన శ్రీను పేరుతో వాట్సాప్ గ్రూప్ ఏర్పాటు చేసి, దాతల ద్వారా సేకరించిన రూ.1.10లక్షల నగదును సోమవారం శ్రీనివాస్ కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మధు, రాము, సాంబయ్య పాల్గొన్నారు.

ఓటరు జాబితా ప్రదర్శన

మహబూబాబాద్ రూరల్: మండలంలోని 41జీపీల పరిధిలో గల ఓటర్లకు సంబంధించిన రెండో సప్లిమెంటరీ జాబితాలను ఆయా జీపీ కార్యాలయాల్లో ఏర్పాటు చేశామని ఎంపీడీఓ రఘుపతిరెడ్డి సోమవారం తెలిపారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే మంగళవారం జీపీ కార్యాలయాల్లో ఫిర్యాదులు అందజేయాలని సూచించారు. నేడు రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశామని పేర్కొన్నారు.

సౌకర్యాలు కల్పించాలి

డోర్నకల్: బూరుగుపాడు అంగన్‌వాడీ కేంద్రంలో సౌకర్యాలు కల్పించాలని కోరుతూ తహసీల్దారు కృష్ణవేణి, ఎంపీడీఓ శ్రీనివాస్‌నాయక్‌కు సోమవారం గ్రామస్తులు వినతిపత్రం అందించారు. బూరుగుపాడు అంగన్‌వాడీ కేంద్రానికి సొంత భవనం ఉన్నా విద్యుత్, ప్రహరీ లేదని, ప్రీస్కూల్ పిల్లలతోపాటు బాలింతలు, గర్భిణీలు ప్రతీ రోజూ కేంద్రానికి వస్తూ వసతులు లేక ఇబ్బందులు పడుతున్నారని కాంగ్రెస్ నాయకుడు దబ్బా శ్రీనివాస్ కోరారు.

మేనేజర్‌గా ఉదయ్‌కుమార్



డోర్నకల్: డోర్నకల్ మున్సిపల్ మేనేజర్‌గా నియమితులైన ఉదయ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

మంచినీటి సమస్యను పరిష్కరించాలి

తొర్రూరు: పట్టణంలో నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఈమేరకు సోమవారం మున్సిపాలిటీ కార్యాలయంలో కమిషనర్ శాంతికుమార్‌కు వినతిపత్రం సమర్పించారు. మాజీ కౌన్సిలర్ శ్రీనివాసరావు, పట్టణ వాసులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

పెద్దవంగర/తొర్రూరు: పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి జన్మదిన వేడుకలను కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ మండల నాయకులు, అభిమానుల సమక్షంలో కేక్‌కట్ చేశారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు.

పోలీసులను ఆశ్రయించిన ప్రేమజంట

డోర్నకల్: ప్రేమించి పెళ్లి చేసుకున్న ఓ జంట తమకు రక్షణ కల్పించాలంటూ డోర్నకల్ పోలీసులను ఆశ్రయించారు. డోర్నకల్ మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న కరీంనగర్‌కు చెందిన వడ్డెపల్లి రమేశ్, ఏపీలోని బాపట్ల జిల్లా గాజుల్లంక పంచాయతీ పరిధిలోని పెసర్లంకకు చెందిన అన్నంనేని శ్రీవిద్య మధ్య స్నేహం ప్రేమగా మారడంతో గార్ల మండలం మర్రిగూడెం వేంకటేశ్వరాలయంలో సోమవారం వివాహం చేసుకున్నారు. తమకు కుటుంబం నుంచి రక్షణ కల్పించాలని కోరుతూ సీఐ బి.రాజేష్‌ను కలిసి వినతిపత్రం అందించారు.

చర్య తీసుకోవాలి

మహబూబాబాద్: డీఎంహెచ్ఓ మురళీధర్‌పై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని సీనియర్ జర్నలిస్ట్ మట్టూరి నాగేశ్వర్‌రావు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యాలయంలో పని చేస్తున్న సీనియర్ అసిస్టెంట్ కిరణ్ మూడునెలలుగా విధులకు హాజరుకావడం లేదన్నారు. సెలవుల్లో లేకున్నా అతడి విషయంలో డీఎంహెచ్ఓ సహకరిస్తున్నారన్నారు. అతడి వద్ద డబ్బులు డీఎంహెచ్ఓ తీసుకున్నాడని ఆరోపించారు. అందుకు సహకరిస్తున్న సూపరింటెండెంట్‌ను కూడా సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

శ్మశానవాటికకు స్థలం కరువు

- నేతలు మారినా ఈదులపూసపల్లి రాతలు మారలే..
- ఏళ్లుగా దహన సంస్కారాలకు గ్రామస్తుల ఇబ్బందులు

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఈదులపూసపల్లి ఉంది. మానుకోట గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీ అయిన క్రమంలో ఈదులపూసపల్లి మానుకోట జిల్లా కేంద్రంలో విలీనం చేసి ఒకటో వార్డుగా రూపొందించారు. కావాల్సిన సౌకర్యాలు లేక వార్డు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతిమ సంస్కారాలు నిర్వహించడానికి కూడా సరైన సౌకర్యాలు లేవు. కొన్ని ఏళ్లుగా శ్మశానవాటిక లేక వార్డు ప్రజలు రాళ్ల వాగు, చెరువుల కుంటలో, తమ పొలాల్లో దహన సంస్కారాలు చేస్తున్నారు. వర్షాకాలం అయితే చెప్పలేని బురదలో ఇబ్బందులు పడుతూ అంత్యక్రియలు నిర్వహించాలంటే ప్రజలు



ఈదులపూసపల్లి గ్రామం

జంకుతున్నారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఈదుల పూసపల్లిలో ఉన్న అక్కినేని కుంటలో 25ఎకరాల స్థలంలో రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించి వైకుంఠధామం ఏర్పాటు చేస్తామని గత పాలకులు హామీలు ఇచ్చారన్నారు. ఆ హామీలు నీటి మూటలే అయ్యాయని ప్రజలు వాపోతున్నారు. ఈదులపూసపల్లి మానుకోట మున్సిపాలిటీలో విలీనమై ఐదు సంవత్సరాలు గడుస్తున్న పట్టించుకున్న నాథుడే లేడు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఈదుల పూసపల్లి ఒకటో వార్డులో శ్మశానవాటిక, రోడ్లు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో మంచినీటి సమస్య పరిష్కరించాలని పలువురు కోరుతున్నారు.

పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చాం..



గ్రామపంచాయతీ నుంచి మున్సిపాలిటీలో విలీనమై ఒకటో వార్డుగా ఏర్పాటు చేశారు. గతంలో మున్సిపల్ కమిషనర్‌కు శ్మశానవాటిక ఏర్పాటు చేయాలని పలుమార్లు వినతిపత్రం అందజేశారు. ప్రస్తుతం నూతనంగా గెలుపొందిన ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేయగా త్వరలోనే శ్మశానవాటిక తగిన స్థలం పరిశీలించి ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

– వినేయ్ కుమార్, ఈదులపూసపల్లి

శ్రీరాంసాగర్ నీటిని మళ్లించాలి

- సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు శ్రీనివాసరావు

గార్ల: వేసవి ప్రారంభం కాకముందే గార్ల సమీపంలోని పాకాల ఏరు ఎండిపోతున్నందున శ్రీరాంసాగర్ నీటిని పాకాల ఏటికి మళ్లించాలని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు కట్టెబోయిన శ్రీనివాసరావు సంబంధిత జిల్లా అధికారులను డిమాండ్ చేశాడు. సోమవారం గార్లలో ఆయన మాట్లాడారు. పాకాల ఏటి పరివాహక ప్రాంతాల్లో గార్ల, బయ్యారం మండలాలకు చెందిన రైతులు వందలాది ఎకరాల్లో యాసంగి వరిపంట సాగు చేశారని, మరో 20రోజుల్లో ఏరు పూర్తిగా ఎండిపోయే ప్రమాదం ఉన్నందున, పాకాల ఏటికి ఎస్సారెస్పీ కెనాల్ నీటిని విడుదల చేయాలని కోరారు. ఇప్పటికైనా సంబంధిత జిల్లా అధికారులు స్పందించి పాకాల ఏటికి ఎస్సారెస్పీ కెనాల్ నీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి జంపాల వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శ్రీనివాసరావు

నీటి ఎద్దడి లేకుండా చర్యలు



తూర్పుతండాను సందర్శిస్తున్న డీఈ అనూష

దంతాలపల్లి: రాబోయే వేసవిలో గ్రామీణ ప్రాంతాలలో నీటి ఎద్దడి లేకుండా చూస్తామని మిషన్ భగీరథ డీఈ అనూష అన్నారు. నీటి ఎద్దడి లేకుండా తీసుకునే చర్యల్లో భాగంగా సోమవారం మండలంలోని రామవరం, ఆగపేట, తూర్పుతండా గ్రామాలను సందర్శించారు. ఈసందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రజలకు నీళ్లు అందించేందుకు ఉన్న వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వేసవిలో ప్రజలు ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వివేక్‌రామ్, ఎంపీఓ అప్సర్ పాషా, ఏఈ ప్రదీప్, కార్యదర్శులు పాల్గొన్నారు.

యువత సన్మార్గంలో నడిచేందుకే క్రీడలు



టోర్నమెంట్ ప్రారంభిస్తున్న ఎస్సై

గార్ల: క్రీడలతో యువకుల్లో స్నేహభావం పెంపొందుతుందని ఎస్సై ఎస్‌కె రియాజ్‌పాషా అన్నారు. సోమవారం మండలంలోని సీతంపేట గ్రామంలో సమక్క–సారలమ్మ జాతరను పురస్కరించుకొని జిల్లాస్థాయి క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ఆయన లాంఛనంగా ప్రారంభించి మాట్లాడారు. నేటి సమాజంలో యువత చెడు మార్గాన్ని వీడి సన్మార్గంలో పయనించేందుకు క్రీడలు ఎంతో దోహదపడతాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో టోర్నమెంట్ బహుమతి దాతలు ఊరుగొండ శ్రీనివాస్, భూక్యా భద్రుస్వామి, మాలోత్ హనుమంతు, నరేష్, ఎంఈఓ వీరభద్రం, హెచ్ఎం ఎం.శివ, శంషాద్‌బేగం, నిర్వాహకులు మాలోత్ భాస్కర్‌నాయక్, సర్వేశ్ నాయక్, లావణ్య శ్రీను, శ్రీను పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలి

నెహ్రూసెంటర్/మరిపెడ రూరల్/గూడూరు/పెద్ద వంగర్/కురవి: ఎస్సీ వర్గీకరణ కోసం అసెంబ్లీలో తీర్మాణం చేసి చట్టబద్ధత కల్పించాలని ఎమ్మార్పీఎస్ జాతీయ కార్యదర్శి కోండ్ర ఎల్లయ్య డిమాండ్ చేశారు. ఈనెల 7వ తేదీన జరగనున్న 'లక్ష డప్పులు.. వెయ్యి గొంతులు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సోమవారం దండోరా వేసి ప్రచారం నిర్వహించారు. అనంతరం సభ వాల్‌పోస్టర్లు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. ఏకసభ్య కమిషన్ నివేదిక వచ్చినందున ఆలస్యం చేయకుండా ప్రభుత్వం వెంటనే వర్గీకరణ ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, రాధా,సుధారాణి, దేవి, ఉపేందర్, సమ్మయ్య, సత్యపాల్, జయరాజ్, నారాయణ, బాలరాజు, వెంకటేష్ పాల్గొన్నారు.



నెహ్రూసెంటర్: ప్రచారం చేస్తున్న నాయకులు

ఉద్యోగి రాకపోయినా సంతకాలు..!

- మామూళ్లు తీసుకొని ఆన్‌డ్యూటీగా నిర్ధారణ
- విధులకు రాని ఉద్యోగి
- అధికారుల ఆశీస్సులతో హైదరాబాద్‌లో చదువు
- ఆలస్యంగా వెలుగులోకి..

నర్సింహులపేట: నర్సింహులపేట ఎంపీడీఓ కార్యాలయంలో అటెండర్ విధుల్లో చేరిన ఓ మహిళా ఉద్యోగి అధికారుల ఆశీస్సులతో విధులకు రాకుండా హైదరాబాద్‌లో చదువుతున్నట్లు తెలిసింది. తొర్రూరు మండలంలోని ఒక గ్రామంలో ఉపాధ్యాయుడు మరణించడంతో కారుణ్య నియామకాల్లో భాగంగా నర్సింహులపేట ఎంపీడీఓ కార్యాలయంలో సెప్టెంబర్ 24, 2024న అటెండర్‌గా జాయిన్ అయింది. నెల రోజులు విధులకు హాజరైన ఆమె ఏకంగా ఉద్యోగం చేయకుండా హైదరాబాద్‌లో బ్యూటీషియన్ కాలేజీలో చదువుతున్నట్లు సమాచారం. నెలకు రెండు సార్లు కార్యాలయానికి వచ్చి అధికారులను మచ్చిక చేసుకొని రిజిస్టర్‌లో సంతకాలు పెడుతున్నట్లు తెల్సింది. విషయం ఈ నోటా.. అనోటా పడి ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. జనవరి 26, 2025న జెండా అవిష్కరణకు వచ్చి వెళ్లినట్లు సమాచారం. విధులకు రాకుండా మెనేజ్ చేస్తున్న విషయం బయటకు పొక్కడంపై వారం కింద సెలవు పెట్టినట్లు తెలుస్తోంది. వివరాలు తెలియాల్సి ఉంది. అయితే ఈ వ్యవహారం అంతా చక్కబెట్టేందుకు కార్యాలయంలోని ఓ ఉద్యోగి సదరు ఉద్యోగి దగ్గర మామూళ్లు తీసుకున్నాడని ప్రచారం.



నర్సింహులపేట ఎంపీడీఓ కార్యాలయం

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా..

విధులకు హాజరు కాకుండా వచ్చినప్పుడు రిజిస్టర్‌లో సంతకాలు పెడుతున్నారని ఉద్యోగిపై ఆరోపణలు వచ్చిన మాట నిజమే. నేను మూడు రోజుల క్రితమే చార్జ్ తీసుకున్నా. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా. వారి ఆదేశాల మేరకు బాధ్యులపై చర్య తీసుకుంటాం.

– కిన్నెర యాకయ్య, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ

ఇంగ్లిష్‌పై పట్టు సాధించాలి

మహబూబాబాద్ అర్బన్: జనరల్ నాలెడ్జ్, కరెంట్ అఫైర్‌తో ఇంగ్లిష్ భాషపై విద్యార్థులు పట్టు సాధించాలని ఇండియా ఎయిర్‌లైన్ ఫ్లైట్ ఇంజనీర్ మహిత అన్నారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో సోమవారం విద్యార్థులకు పైలట్ ఎయిర్‌లైన్ ఉద్యోగాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ జోలి సత్యనారాయణ, ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, శంకర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కెపాసిటర్లను అమర్చుకోవాలి

డోర్నకల్: విద్యుత్ వినియోగదారులు విద్యుత్ వృథాను అరికట్టాలని విద్యుత్ శాఖ డీఈ(ఆపరేషన్స్) విజయ్‌కుమార్ కోరారు. మండలంలోని వెన్నారం గ్రామంలో సోమవారం నిర్వహించిన విద్యుత్ వినియోగదారుల సదస్సులో డీఈ విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. రైతులు విద్యుత్ మోటార్లకు కెపాసిటర్లను అమర్చుకుంటే విద్యుత్ ఆదా అవుతుందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న 200 యూనిట్ల పథకాన్ని అర్హులు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీఈ పెద్దిరాజు, ఏఈ కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

కాలేజీలో సమస్యలు పరిష్కరించాలి

బయ్యారం: జిల్లా కేంద్రంలో జేఎన్టీయూ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇంజనీరింగ్ కాలేజీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పీడీఎస్‌యూ జిల్లా ప్రధాన కార్యదర్శి బాణోత్ దేవేందర్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. కాలేజీలో నీటి సమస్య కారణంగా విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇప్పటికైనా సమస్యలను పరిష్కరించాలన్నారు. పరిష్కరించని లేని ఎడల ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. ఈ సమావేశంలో నాయకులు సిద్ధు, వినేష్, ప్రకాశ్, కృష్ణ, ప్రమోద్, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కురవి: మండల కేంద్రంలో శివరాత్రిని పురస్కరించుకుని 11కేవీ లైన్‌లో గల చెట్ల తొలగింపు కారణంగా నేడు(మంగళవారం) ఉదయం 8గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ శారద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పెట్రోల్ బంక్, గుడి సత్రాలు, ఖమ్మం రోడ్డు, గ్రామపంచాయతీ వంటి ఏరియాల్లో విద్యుత్ నిలిపివేయనున్నట్లు తెలిపారు.

ఎంపీటీసీ స్థానాన్ని కొనసాగించాలి

నెల్లికుదురు: మండలంలోని రత్తిరాం తండా ఎంపీటీసీ స్థానాన్ని యథావిధిగా కొనసాగించాలని రత్తిరాంతండా మాజీ ఎంపీటీసీ సభ్యుడు మధన్‌లాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్టీలకు అతీతంగా రత్తిరాం తండావాసులతో కలిసి ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో తండా వాసులు భాస్కర్ నాయక్, సంజీవ్, రాజేష్, వెంకన్న, హచ్చు నాయక్ పాల్గొన్నారు.

జయప్రదం చేయండి

దంతాలపల్లి: ఈనెల 16 న హైదరాబాద్‌లోని ఓంకార్ భవనం బాగులింగంపల్లిలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమొక్రసీ తొర్రూరు డివిజన్ కార్యదర్శి ఆలకుంట్ల సాయిలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సదస్సు వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు.

సర్కారు దవాఖానాల్లోనే మెరుగైన వైద్యం

చిన్నగూడూరు: సర్కారు దవాఖానాల్లోనే మెరుగైన వైద్యం అందుతుందని ఉగ్గంపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని ఉగ్గంపల్లి మంచ్యాతండాకు చెందిన ఆంగోతు రాజేశ్వరి పురిటి నొప్పులతో బాధపడుతూ ఉగ్గంపల్లి పీహెచ్‌సీకి రావడంతో వైద్యాధికారి ప్రవీణ్ కుమార్ వైద్య పరీక్షలు నిర్వహించి నార్మల్ డెలివరీ చేశారు. కార్యక్రమంలో స్టాఫ్ నర్సు మాధవి, ఏఎన్ఎం భారతి, ఆశలు నిర్మల, జ్యోతి పాల్గొన్నారు.

రామచంద్రజీయర్ స్వామి పూజలు



డోర్నకల్: స్థానిక వేంటేశ్వరస్వామి ఆలయంలో సోమవారం శ్రీశ్రీశ్రీ త్రిదండి రామచంద్రజీయర్ స్వామి పూజలు నిర్వహించారు. ముదుపుగల్ గ్రామంలో దేవాలయ ప్రతిష్ఠ వేడుకల కోసం వెళ్తూ స్థానిక వేంకటేశ్వరాలయంలో పూజలు నిర్వహించారు.

బస్సు సౌకర్యం కల్పించాలి

నెహ్రూసెంటర్: విద్యార్థులకు పాఠశాల సమయపాలనకు అనుకూలంగా బస్సు సౌకర్యం కల్పించాలని సీపీఎం నాయకుడు ఎండి.రజాక్ సోమవారం అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పెద్దకొర్పోలు, గుండ్రపల్లి, మడిపల్లి, ఇంటికన్నె, వెంకటగిరి గ్రామాలకు బస్సు సౌకర్యం లేకపోవడంతో విద్యార్థులు పాఠశాల, కళాశాలలకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

వ్యవసాయ బావిలో పడి వ్యక్తి మృతి

దంతాలపల్లి: వ్యవసాయ బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం రాత్రి మండల కేంద్రం చివారులో చోటుచేసుకుంది. ఎస్సై పిల్లల రాజు తెలిపిన వివరాల ప్రకారం.. మండలం చిల్లంచర్ల గ్రామానికి చెందిన నాగిరెడ్డి రఘునాథం(68), భార్య పేరు సమ్మక్క. వీరికి కుమార్తె సునీత, కుమారుడు మల్లయ్య ఉన్నారు. రఘునందన్ తాగుడుకు బానిసై ఆస్తులు అమ్ముకొని మానసిక స్థితిని కోల్పోయి భార్యా, పిల్లలను వదిలి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. 20 ఏళ్లుగా మండలంలోనే భిక్షాటన చేస్తూ జీవిస్తున్నాడు. అతడి మానసిక పరిస్థితి సరిగా లేక మండల కేంద్రంలోని ఓ బావిలో పడి మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీస్‌లకు సమాచారం అందించారు. సిబ్బందితో చేరుకున్న ఎస్సై పిల్లల రాజు మృత దేహాన్ని బయటకు తీసి ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపాడు.

గడ్డివాముల దగ్ధం

మహబూబాబాద్ రూరల్: మండలంలోని చీకటిచింతల తండాకు చెందిన బోడ శంకర్, బోడ సుక్యా, బోడ వీరన్నకు చెందిన మూడు గడ్డివాములు ప్రమాదవశాత్తు సోమవారం అగ్నికి ఆహుతయ్యాయి. ముగ్గురు అన్నదమ్ముల గడ్డివాములు పక్కపక్కనే ఉండగా ప్రమాదవశాత్తు వాటికి నిప్పంటుకుని కాలిపోతుండగా స్థానికులు పోలీసులు, ఫైర్ సేఫ్టీ వారికి సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక వాహనంతో సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. దగ్ధమైన మూడు గడ్డివాముల విలువ సుమారు రూ.80వేల వరకు ఉంటుందని బాధిత రైతులు తెలిపారు.

కుష్ఠుపై అవగాహన ర్యాలీ

కురవి: మండలంలోని బలపాల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మొగిలిచర్ల సబ్‌సెంటర్‌లో సోమవారం స్పర్శ్ లెప్రసీ అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఎల్లయ్య, పీహెచ్ఎన్ సీహెచ్ శోభ, హెల్త్ అసిస్టెంట్ అరుణదేవి, ఆశకార్యకర్తలు పాల్గొన్నారు.

కేజీబీవీలో వైద్యశిబిరం

కేసముద్రం: మండలంలోని మహముద్‌పట్నం కేజీబీవీలో ఇనుగుర్తి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం వైద్యశిబిరం నిర్వహించారు. ఇటీవల పాఠశాలలో నలుగురు విద్యార్థినులు అనారోగ్యానికి గురైన విషయం తెలిసిందే. విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగానే ఉందని ఎంఎల్‌హెచ్‌పీ ప్రవీణ్, హెచ్ఈఓ భిక్షపతి తెలిపారు.

కుంభమేళాలో అదృశ్యమైన వ్యక్తి ఆచూకీ లభ్యం

కేసముద్రం: ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ప్రయాగ్‌రాజ్ మహాకుంభమేళాలో గత జనవరి 27న నది స్నానానికి వెళ్లిన కేసముద్రంవిలేజ్‌కి చెందిన కాసాని భిక్షం అనే వృద్ధుడు అదృశ్యమైన విషయం తెలిసిందే. ఈ మేరకు తన తండ్రి కుంభమేళాలో తప్పిపోయాడని ఇనుగుర్తి మండలం అయ్యగారిపల్లి గ్రామానికి చెందిన ఐజీ రాములునాయక్ దృష్టికి సోమవారం ఉదయం తీసుకెళ్లగా, ఇట్టి విషయాన్ని అతడు ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ పోలీస్ ఆఫీసర్‌కు సమాచారం అందించాడని భిక్షం కుమారుడు ఐలయ్య తెలిపాడు. దీంతో అదృశ్యమైన భిక్షం కాశీలో తిరుగుతుండగా పోలీసులు గుర్తించి వారి ఆధీనంలోకి తీసుకుని, వెంటనే వరంగల్ పోలీసులకు సమాచారం అందించారని, ఇట్టి విషయాన్ని కేసముద్రం పోలీసులు తనకు చెప్పారని ఐలయ్య తెలిపాడు. కాగా ఈనెల 5న వరంగల్‌కు అదృశ్యమైన తన తండ్రి రానున్నట్లు ఆయన తెలిపాడు.

ఫీజుల పేరుతో కళాశాల వేధింపులు

మరిపెడ/మరిపెడ రూరల్: ఫీజుల పేరుతో యాజమాన్యం వేధిస్తోందని మండల కేంద్రంలోని సిద్దార్థ ఐటీఐ కళాశాల ఎదుట విద్యార్థులు సోమవారం ఆందోళనకు దిగారు. ఈసందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ.. కళాశాల యాజమాన్యం ఇష్టం వచ్చినట్లు ఫీజులు వసూలు చేస్తున్నారని తెలిపారు. కేవలం రూ.125 ఉన్న పరీక్ష ఫీజును రూ.2వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని విద్యార్థులు ఆరోపించారు. ఇదే కాదు ప్రాక్టికల్ పరీక్షల పేరుతో, కళాశాలకు 85శాతం హాజరు పేరుతో, సెంటర్ పరీక్షల పేర్లతో ఇలా అనేక రకాల ఫీజులతో విద్యార్థుల వద్ద వేలాది రూపాయలు వసూలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజుల వేధింపులకు తట్టుకోలేక ఇదే కళాశాలలో చాలా మంది విద్యార్థులు గత ఏడాది పరీక్షలు రాయలేదన్నారు. దీంతో వీరంతా మళ్లీ సప్లమెంటరీ పరీక్షలు రాయడానికి వస్తే అప్పటి ఇప్పటి కలిపి డబుల్ ఫీజులు కింద వసూలు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికైన ఫీజుల పేరుతో విద్యార్థులను వేధిస్తున్న సదరు ఐటీఐ కళాశాల యాజమాన్యంపై విచారణ చేపట్టి బాధిత విద్యార్థులకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులను వేడుకున్నారు.



కళాశాల ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థులు

భక్తిశ్రద్ధలతో వసంత పంచమి పూజలు



మహబూబాబాద్ అర్బన్: శ్లోక కిడ్జ్ ప్లే స్కూల్‌లో సరస్వతీ మాత వేషధారణలో చిన్నారులు



బయ్యారం: పూజలో పాల్గొన్న విద్యార్థులు

గూడూరు: మండల కేంద్రంలోని సనాతన శివాలయంలో సోమవారం మాఘశుద్ధ వసంత పంచమి, సరస్వతిదేవి జన్మదినాన్ని పురస్కరించుకొని ఆలయ పూజారి సతీష్‌పాండ్యే పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పూజల అనంతరం అక్షరాభ్యాసం చేయించారు.

బయ్యారం: మండలకేంద్రంలో వసంతపంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాలు, పాఠశాలల్లో ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. అనంతరం చిన్నారులకు అక్షరాభ్యాస కార్యక్రమంలో చిన్నారులతో ఓనమాలు దిద్దించారు.

మహబూబాబాద్ అర్బన్: జిల్లా కేంద్రంలోని శ్లోక కిడ్జ్ ప్లే స్కూల్‌లో విద్యార్థులు సరస్వతీ మాత వేషధారణలో వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు.

బడ్జెట్‌లో తెలంగాణపై కేంద్రం వివక్ష



మహబూబాబాద్ రూరల్: నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు



కేసముద్రం: ప్రధాని మోదీ దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు

కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణపై కేంద్ర ప్రభుత్వం వివక్షతను చూపిందని ఆరోపిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాని మోదీ దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం పలువురు కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. అన్నిరాష్ట్రాలను సమానంగా చూడాల్సిన కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్ష పార్టీలు అధికారంలో ఉన్న రాష్ట్రాలపై వివక్షను చూపిందన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



గార్ల: నిరసన తెలుపుతున్న నాయకులు